క్లుప్తంగా

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం



గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపు పేట గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడికి పలువురు దాతలు తమ వంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా గ్రామానికి చెందిన మళ్ల రఘు భాస్కరరావు, భాను దంపతులు రూ.10,116 నగదును సోమవారం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వన్ స్టాప్ సెంటర్‌కు మతిస్థిమితం లేని యువతి




మతిస్థిమితం లేని యువతి

యలమంచిలి రూరల్: మండలంలోని ములకలాపల్లి, బయ్యవరం గ్రామ పరిసరాల్లో సోమవారం మధ్యాహ్న సమయంలో సంచరిస్తున్న మతిస్థిమితం లేని యువతిని గుర్తించిన యలమంచిలి రూరల్ పోలీసులు అనకాపల్లిలో వన్ స్టాప్ సెంటర్‌కు అప్పగించారు. 18 సంవత్సరాల వయసున్న యువతి నలుపు రంగు ప్యాంటు, కాలర్ లేని ఆకుపచ్చ రంగు టీషర్టు ధరించి ఉంది. యువతి సక్రమంగా తన పేరు, చిరునామా వంటివి చెప్పలేకపోతోంది. దీంతో స్థానిక స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారులు, యలమంచిలి రూరల్ పోలీసులు ఆమెను వన్ స్టాప్ సెంటర్‌కు తరలించారు. యువతి ఆచూకీ తెలిసినవారు తమను సంప్రదించాలని యలమంచిలి రూరల్ ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు.

రెండు పాడి గేదెల అపహరణ

ఎస్.రాయవరం: గోకులపాడు గ్రామంలో పాక వద్ద కట్టేసి ఉంచిన రెండు పాడి గేదెలను దొంగలు అపహరించుకుపోయారని బాధితులు వాపోయారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సమ్మెంగి దుర్గా ప్రసాద్ తన తల్లికి డెంగ్యూ జ్వరం రావడంతో నాలుగు రోజులుగా విశాఖపట్నం ఆస్పత్రిలో ఉన్నారు. ఇది గమనించిన దుండగులు గుట్టుచప్పుడు కాకుండా వ్యాన్ తీసుకొచ్చి రూ.1.50 లక్షల విలువ చేసే రెండు పాడి పశువులను తరలించుకుపోయారు. అయితే ఈ విషయంపై బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ విభీషణరావు తెలిపారు.


లో–ఓల్టేజీతో అవస్థలు



చినలింగాపురంలో లో ఓల్టేజీ కారణంగా తక్కువ వెలుతురు వస్తున్న దృశ్యం

కోటవురట్ల: చినలింగాపురంలో లో–ఓల్టేజీ సమస్యతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. రెండు వారాలుగా సమస్య ఉన్నా విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లో ఓల్టేజీ కారణంగా ఫ్యాన్లు నెమ్మదిగా తిరుగుతున్నాయని, లైట్లు కిరోసిన్ దీపాలులా వెలుగుతున్నాయని, ఏసీలు ఆన్ అవ్వటం లేదని చెబుతున్నారు. అసలే వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. తీవ్ర వడగాలులు వీస్తున్నాయి. వాతావరణం వేడెక్కడంతో జనాలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో లో ఓల్టేజీ సమస్యతో పిల్లలు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఫ్యాన్లు కూడా తిరగక పోవడంతో రాత్రంతా జాగారం చేస్తున్నామని చెబుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా సమస్యను పరిష్కరించలేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెనుగొల్లు పీఏసీఎస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన చైర్మన్ పవన్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: పెనుగొల్లు పీఏసీఎస్ చైర్మన్‌గా రెడ్డి పవన్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సంఘం అభివృద్ధికి పాటుపడతానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. రైతులకు సహకార పరపతి సంఘం ద్వారా అందే సేవలపై అవగాహన కల్పిస్తామన్నారు.

ఖరీఫ్ సాగుపై నీలినీడలు..!

- వర్షాభావ పరిస్థితులతో రైతుల్లో ఆందోళన
- జూలై మాసం ముగిసినా కానరాని వర్షాలు
- ఎండిపోతున్న వరి నారుమడులు

మునగపాక: ఖరీఫ్ వరి సాగుపై ఈ ఏడాది నీలినీడలు కమ్ముకున్నాయి. గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రత కారణంగా ఆకుమడులు ఎదుగుదలకు నోచుకోలేదు. ఫలితంగా ఖరీఫ్ వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఎంతో ఆశపడి ఖరీఫ్‌లో వరి సాగుకు సిద్ధమవుతున్న రైతులకు వరుణుడు ముఖం చాటేయడంతో ఏం చేయాలో తెలియక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సాగు నీటి కాలువలపై ఆధారపడి వరిసాగు చేపడదామనుకుంటున్న రైతులకు వర్షాలు గుదిబండగా మారుతున్నాయి.

సాగునీటి కాలువలు వెలవెల

సీజన్‌లో సాగునీటి కాలువల ఆధారంగా పలువురు రైతులు వరి సాగు చేపడుతుంటారు. అయితే జూలై మాసం ముగిసినా ఇంత వరకు వర్షాలు కురవకపోవడంతో రైతులు కలవరపడుతున్నారు. కొద్ది రోజులుగా ఎండల తీవ్రత పెరిగిపోవడంతో అన్నదాతకు నిద్రపట్టడం లేదు. వర్షాలు లేకపోవడంతో సాగునీటి కాలువల్లో చుక్కనీరు కనిపించడం లేదు. దీనికి తోడు పలు చోట్ల కాలువలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఎగువ నుంచి వచ్చే చుక్కనీరైనా పంటల సాగుకు ఉపయోగకరంగా ఉంటుందని ఆశిస్తున్నా అటువంటి దాఖలాలు కనిపించడం లేదు.

లక్ష్యం నెరవేరేనా!

సీజన్‌లో ఖరీఫ్ వరిసాగు లక్ష్యం నెరవేరుతుందా? లేదా? అన్న అనుమానాలు అందరిలో వ్యక్తమవుతున్నాయి. వరి సాగు విస్తీర్ణం 1456 హెక్టార్లుగా ఉంది. ఈ ఏడాది అన్నీ అనుకూలంగా ఉంటే సాగు విస్తీర్ణం పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. అయితే వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగు విస్తీర్ణం ఎలా ఉంటుందోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో కన్నా ఈ ఏడాది వరి సాగు పెరిగే పరిస్థితులలో వర్షాలు ముఖం చాటేయడంతో లక్ష్యం నెరవేరే అవకాశాలు కనిపించడం లేదు.



మునగపాకలో చుక్కనీటికి నోచుకోని సాగునీటి కాలువ

వెదజల్లే పద్ధతి మేలు



వరిలో వెదజల్లే పద్ధతిని రైతులు అలవాటు చేసుకోవాలి. ఈ పద్ధతిలో సాగు ఖర్చు తగ్గుతుంది. దీనికి తోడు దిగుబడులు పెరుగుతాయి. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో వరిసాగు మందకొడిగా కనిపిస్తుంది. సాగునీటి వనరుల ద్వారా వరి సాగు జరిగేలా చూడాలి. ఆకుమడులు ఎండకుండా చూసుకోవాలి. తరచూ తడుపుతూ ఉండడం ద్వారా ఆకుమడులను కాపాడుకోవచ్చు.

– సీహెచ్.జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి



వాడ్రాపల్లి–తిమ్మరాజుపేట మార్గంలో ఎదుగుదలకు నోచుకోని ఆకుమడి

వర్షాల కోసం రైతుల ఎదురుచూపులు

ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు అవసరమైన సన్నాహాలను రైతులు చేపడుతున్నారు. ఇప్పటికే పలు చోట్ల దుక్కులు పూర్తి చేసి ఆకుమడులు వేశారు. సాధారణంగా ఆకుమడి వేసిన 21 రోజుల తరువాత ఉడుపులకు రైతులు ఉపక్రమిస్తారు. వర్షాలు కురవకపోవడంతో ఆకుమడులు పలు చోట్ల ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాగునీరు లేదు గానీ తీరువా కట్టాలా?



మాట్లాడుతున్న రైతు సంఘ మండల గౌరవ అధ్యక్షుడు బ్రహ్మాజీ

మునగపాక: వ్యవసాయ భూములకు సక్రమంగా సాగునీరు సరఫరా కావడం లేదు గానీ రైతులు నీటి తీరువా చెల్లించాలంటూ అధికారులు నోటీసులు జారీ చేయడం తగదంటూ రైతు సంఘ మండల గౌరవ అధ్యక్షుడు ఎస్.బ్రహ్మాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక పీఏసీఏస్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. కొద్ది రోజులుగా వర్షాలు కురవక ఆకుమడులు ఎండిపోతున్నాయంటూ రైతులు గగ్గోలు పెడుతుంటే.. పుండు మీద కారం చల్లినట్లు రెవెన్యూ అధికారులు నీటి తీరువా బకాయిలు చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు పంపడం సరికాదన్నారు. సాగునీటి వనరులు అధ్వానంగా ఉండడంతో నీటి ప్రవాహం కూడా అగమ్యగోచరంగా ఉందన్నారు. గొడారి ఆనకట్ట మరమ్మతులు చేపట్టని కారణంగా నీరు వృథాగా పోయే పరిస్థితులు ఎదురవుతాయన్నారు. రైవాడ నీరు ఇతర ప్లాంట్లకు తరలిపోవడంతో కనీసం నాలుగు మాసాలైనా పంటలకు సాగునీరు ప్రవహించే పరిస్థితులు లేవన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో నోటీసులు పంపడం మానుకోవాలన్నారు. లేదంటే రైతులతో కలిసి ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సంఘం నాయకులు దాడి భాస్కరరావు, భీశెట్టి సన్యాసినాయుడు, పొలిమేర రాము, వేగి సూరిబాబు, దాడి నాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కుపై ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి



గుర్రాజుపేట లో ఆందోళన చేస్తున్న రైతులు, వ్యవసాయ కూలీలు

ఎస్.రాయవరం: బల్క్ డ్రగ్ పార్కుపై తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని గుర్రాజుపేట గ్రామస్తులు సోమవారం నిరసన గళం విప్పారు. నక్కపల్లి మండలం గ్రామాలతో పాటు ఎస్.రాయవరం మండలం గుర్రాజుపేట గ్రామంలో కూడా 172 ఎకరాల భూసేకరణకు పూనుకోవడంపై ఆందోళనకు దిగారు. విష వాయువులు వెదజల్లే పరిశ్రమలు తమకు వద్దని, ప్రభుత్వ పెద్దలు నిర్ణయించిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పర్యావరణ, ప్రజారోగ్యాలు హాని కలిగించే పరిశ్రమలకు తాము భూములు ఇవ్వబోమని తేల్చి చెప్పారు. ప్రజామోదం లేని, విదేశాల్లో నిషేధించిన బల్క్ డ్రగ్స్ పార్కును ఏర్పాటు చేయవద్దని, ఈ నెల 6న తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సత్యనారాయణ, రైతులు ఎం.రాజేష్, దాట్ల రామరాజు, వెంకటపతిరాజు, మహదేవ్, గోవిండ్, రమణ, అప్పలరాజు, మంగ, బంగారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష



కోటవురట్లలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



నామవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

కోటవురట్ల: తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయని అంగన్‌వాడీ సిబ్బంది నినదించారు. యండపల్లి సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ అవగాహన కల్పించారు. అనంతరం ప్రధాన రహదారిలో ర్యాలీ చేశారు. కూడలిలో మానవహారం నిర్మించి అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు హైమావతి, సుజాత మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధకంగా పనిచేస్తాయని తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఆరునెలల వయస్సు వచ్చేంత వరకు బిడ్డకు తల్లి పాలే ఇవ్వాలన్నారు. తల్లిపాలు పిల్లల్లో వ్యాధులు రాకుండా కాపాడతాయన్నారు. సూపర్‌వైజర్లు జిల్లా బాలల సంరక్షణ సమితి ప్రతినిధి లోవరాజు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పాయకరావుపేట: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని నామవరం గ్రామంలో స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోషకాహార విలువలు ఉన్న గుడ్లు, పాలు, పప్పు దినుసులు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పాటించాలన్నారు. శిశువు పట్ల తల్లులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఎం.నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

బాబును నమ్మితే మోసం ఖాయం



తిమ్మరాజుపేటలో గ్రామస్తులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీ

- వైఎస్సార్‌సీపీ యలమంచిలి సమన్వయకర్త ధర్మశ్రీ

అచ్యుతాపురం రూరల్ : సీఎం చంద్రబాబును నమ్మితే కచ్చితంగా మోసపోవడం ఖాయమని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ విమర్శించారు. సోమవారం మండలంలో జగ్గన్నపేట, ఖాజీపాలెం, పెదపాడు, తిమ్మరాజుపేట గ్రామాల్లో ఆయన పర్యటించి 'బాబూ ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ మాట తప్పని మడం తిప్పని మొనగాడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సూపర్ సిక్స్ అంటూ ప్రజల్ని మోసం చేస్తున్న చంద్రబాబును వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాల అమలులో జాప్యం చూపుతున్న చంద్రబాబును ఇప్పటికీ నమ్మితే కచ్చితంగా మోసపోతారన్నారు. అభివృద్ధి పేరుతో రైతులకు టీడీఆర్ బాండ్లు ఇస్తామనడం అన్యాయమన్నారు. గ్రావెల్ మాఫియా యథేచ్ఛగా రెచ్చిపోతుందన్నారు. గ్రామాల్లో కమిటీలు వేసి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలన్నారు. ప్రస్తుతం ఎవరైతే పార్టీ జెండా మోస్తున్నారో వారికి సముచిత స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన సంధ్యబుజ్జి, పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాము, కో ఆప్షన్ సభ్యులు నర్మాల కుమార్, పార్టీ సీనియర్ నాయకులు మారిశెట్టి సూర్యనారాయణ, భీముని వెంకటేశ్వర్రావు, బలిరెడ్డి శ్రీను, ఉమ్మిడి జగన్, దొడ్డి కృష్ణ, పీలా నర్సింగరావు, శరగడం రాము, గంగూళి శ్రీను, చోడిపల్లి దేముడు, మాడెం సూరిబాబు, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ అప్పన్న

పాయకరావుపేట: రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని సీఐ అప్పన్న సూచించారు. శ్రీప్రకాష్‌లో సోమవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వేగ పరిమితిని పాటించాలని, బైక్‌లపై వెళ్తున్నప్పుడు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ గుర్తులను గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, డ్రైవర్లు, కానిస్టేబుల్ దేవమ్మరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో గ్రామాల అభివృద్ధికి కృషి



కాలువ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ

మునగపాక: జిల్లా పరిషత్ నిధులతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని మునగపాక జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని మల్లవరం శివారు కుంచవానిపాలెంలో జిల్లా పరిషత్ నిధులు రూ.4 లక్షలతో నిర్మించనున్న కాలువకు ఆయన సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులతో మండలంలోని పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తానన్నారు. సర్పంచ్ ఇందల హేమలత, పెద్దలు ఇందల నాయుడు, సాలాపు నరసింగరావు, పంచాయతీ వార్డు సభ్యులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నష్టపరిహారం నగదు రూపంలో చెల్లించాలి



వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

విశాఖ సిటీ : అనకాపల్లి నుంచి అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు, షాపులు కోల్పోతున్న నిర్వాసితులకు నగదు రూపంలో నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బాధితులకు టీడీఆర్ బాండ్లు వద్దని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని కోరుతూ సోమవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం కార్పొరేటర్ బొడ్డు గంగారావు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో ఇళ్లు పూర్తిగా పోతున్న వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఆర్ అండ్ బీ రోడ్డు పరిధిలో చిల్లర వ్యాపారం ద్వారా జీవనం పొందుతున్న వారిని నిర్వాసితులుగా పరిగణించి ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. 100 అడుగుల తర్వాత ఇళ్ల నిర్మాణాలకు ఎటువంటి నిబంధనలు పెట్టకూడదన్నారు. అనంతరం ఆయనతోపాటు నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్.రాము, కో కన్వీనర్ కె.రామ సదాశివరావు, రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, బాబూరావు తదితరులు వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేశారు.

రైతులకు రూ.20 లక్షల రుణాలు



రైతులకు రుణాలు అందిస్తున్న బుజ్జి

నక్కపల్లి: రైతులకు ఖరీఫ్ సీజన్‌లో రూ.20 లక్షల రుణాలు అందజేస్తున్నట్లు నక్కపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ కొప్పిశెట్టి బుజ్జి తెలిపారు. సోమవారం ఆయన పీఏసీఎస్‌లో రైతులకు రుణాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా పర్సన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం రుణాలు పంపిణీ చేశారు. సభ్యుల సంఖ్య పెంచడంతో పాటు సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కోసూరు శ్రీను, ఎం.కొండబాబు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొప్పిశెట్టి వెంకటేష్, టి.శ్రీను పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

పాయకరావుపేట: ప్రతి రైతుతో తప్పనిసరిగా పంట నమోదు చేయించాలని తహసీల్దార్ ఎస్.ఎ. మహేశ్వరరావు సూచించారు. మండలంలో వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పంటపై తగు సూచనలు, సలహాలు అందించాలన్నారు. పంటలు లేని ఖాళీ భూములు, చెరువులు, గ్రామ కంఠాలు నమోదు చేయవద్దని, ఒకవేళ తెలిసి తప్పులు చేస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.ఆదినారాయణ, ఏఈవో నాగమణి, డిప్యూటీ తహసీల్దార్ సంతభూషణరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ త్రినాథరావు, గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్‌లు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు



పనులను పర్యవేక్షిస్తున్న యలమంచిలి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర



కొక్కిరాపల్లి వై జంక్షన్ వద్ద సిమెంటు దిమ్మెలతో మూసివేసిన రహదారి గ్యాప్

యలమంచిలి రూరల్: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు యలమంచిలి సీఐ ఎస్.ధనుంజయరావు తెలిపారు. దీనిలో భాగంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్ఐలు, కింది స్థాయి సిబ్బందితో చర్చించి అందుకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా యలమంచిలి రూరల్ పీఎస్ పరిధి కొక్కిరాపల్లి హైవే కూడలి వద్ద సర్వీసు రోడ్డు, జాతీయ రహదారికి మధ్య డివైడర్ గ్యాప్‌ను సోమవారం మూసివేయించారు. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులతో కలిసి కొక్కిరాపల్లి కూడలి వద్ద డివైడర్ గ్యాప్‌ను సిమెంట్ దిమ్మెలతో మూయించారు. ఈ కూడలి వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణలో భాగంగా ఈ చర్యలు చేపట్టామని సీఐ తెలిపారు. ఇకపై సర్వీసు రోడ్డు నుంచి వచ్చే వాహనాలన్నీ వై జంక్షన్ వద్ద కాకుండా నేరుగా వెళ్లి సమీపంలో ఉన్న రోడ్డు మీడియన్ వద్ద నుంచి యూటర్న్ తీసుకోవాల్సి ఉంటుంది. సోమవారం కొక్కిరాపల్లి కూడలి వద్ద చేపట్టిన ఈ ముందస్తు జాగ్రత్త చర్యలను యలమంచిలి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర స్వయంగా పర్యవేక్షించారు. ఇప్పటి వరకు ఇక్కడ సర్వీసు రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే వాహనాల కారణంగా ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకోవడంపై వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి



చోడమాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న కమిటీ సభ్యులు

అచ్యుతాపురం రూరల్ : దాతల సహకారంతో చోడపల్లి ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ఆలయ ధర్మకర్త కర్రి నాగేశ్వర్రావు తెలిపారు. సోమవారం ఆలయ అభివృద్ధి కోసం పలువురు దాతలు ఇచ్చిన విరాళాలను పలు విధాలుగా ఉపయోగించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయించారు. రూ.9.60 లక్షలతో ఆలయంలో అష్టలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, గుడి స్లాబ్ ఊర్పు, అంతరాలయం తలుపులు, ప్రధాన ద్వారానికి మెరుగులు దిద్దనున్నట్టు ఆయన తెలిపారు.

కో–ఆపరేటివ్ బ్యాంక్ సభ్యుల పిల్లలకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న కో–ఆపరేటివ్ బ్యాంక్ సిబ్బంది

అచ్యుతాపురం రూరల్ : ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ సభ్యుల పిల్లలకు ఏటా ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు బ్యాంక్ అచ్యుతాపురం బ్రాంచి మేనేజర్ ఆర్.ఉమ తెలిపారు. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 11 మంది విద్యార్థులకు రూ.5వేలు, ఇంటర్‌లో ఉత్తీర్ణులైన 12 మందికి రూ.7,500 చొప్పున సోమవారం బ్రాంచిలో అందజేశారు. జేఈఈ మెయిన్స్‌లో 99.81 పర్సంటైల్ సాధించిన ధర్మిరెడ్డి రామ సాయి ప్రసన్న కుమార్‌కు రూ.10వేలు నగదు అందజేశారు. బ్యాంక్ డైరెక్టర్లు జి.జనార్ధనరావు, ఎ.జె.స్టాలిన్, జోనల్ మేనేజర్ ఆర్.తిరుమలరావు, చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, సీఈవో వి.వి.బి.వరలక్ష్మి విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

వెంకటనగర్ కాలనీలో ఎంపీడీవో పర్యటన



కాలువను పరిశీలిస్తున్న ఎంపీడీవో

సాక్షి ఎఫెక్ట్..

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలోని వెంకటనగర్ కాలనీలో సోమవారం ఎంపీడీవో సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు పర్యటించారు. ప్రచారం ఘనం.. పనులు శూన్యం అన్న శీర్షికన కాలనీలో పారిశుధ్య సమస్యలపై సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నెలల తరబడి పూడిక తీతకు నోచుకోకపోవడంతో కాలువల నుంచి దుర్గంధం వెదజల్లుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కథనం రావడంతో స్పందించిన ఎంపీడీవో సీతారామరాజు కాలనీలో పర్యటించారు. పారిశుధ్య సిబ్బందితో క్లోరినేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. కాలువల్లో పూడిక తీత పనులు దగ్గరుండి చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించామన్నారు.